సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 31 । అక్టోబర్ । 2024



మంచి లక్ష్యంతోనే ఉన్నత స్థానం
మంచి లక్ష్యంతో ఉన్నత స్థానానికి ఎదిగి సమాజానికి మేలు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. 8లో

రాజవొమ్మంగిలో 'ఆన్‌లైన్' మోసం
రాజవొమ్మంగిలో ఉద్యోగాలకు ఆశపడి ఆన్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారంతా భారీగా నష్టపోయారు. 8లో



దివ్య వెలుగుల దీపావళి
జిల్లా వ్యాప్తంగా వెలుగుల పండగ దీపావళి సందడి నెలకొంది. మార్కెట్లలో బాణ సంచా అమ్మకాలు భారీగా జరిగాయి. 9లో

న్యూస్‌రీల్

దీపావళి శుభాకాంక్షలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని ప్రజలంతా దీపావళిని ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆకాంక్షించారు. ఆయనతో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం తదితరులు జిల్లా ప్రజలకు వేర్వేరు ప్రకటనల్లో పండగ శుభాకాంక్షలు తెలిపారు.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

- ఆత్మ పీడీ జ్యోతిర్మయి



పశుదాణా ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న జ్యోతిర్మయి తదితరులు

అడ్డతీగల: పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని గొంటువానిపాలెంలో శాంతివర్ధన మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయంతో పాటు పాడి రైతులకు సేవలందించాలన్న సంకల్పంతో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. 110 పశువులను పరీక్షించి మందులు అందజేశారు. దాణా ప్యాకెట్లను పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ అడ్డతీగల ఏడీ గణేష్, వైస్ ఎంపీపీ గంధం బాలసుబ్రహ్మణ్యం, సర్పంచ్ పల్లాల ఏగులమ్మ, పశువైద్యాధికారి వీరేంద్ర, శాంతి వర్ధన పాల్గొన్నారు.

డుంబ్రిగుడ పీహెచ్‌సీ సందర్శన

- సౌకర్యాలను పరిశీలించిన ఎన్‌క్యూఏఎస్ బృందం అధికారి లలిత



పీహెచ్‌సీని సందర్శించిన అధికారి లలిత

డుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఎన్‌క్యూఏఎస్ బృందం అధికారి డాక్టర్ లలిత సందర్శించారు. రోగుల వార్డు, ల్యాబ్, మందుల స్టోర్ రూమ్, ఓపీని ఆమె పరిశీలించారు. వైద్యాధికారికి పలు సూచనలు చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. రోగుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. వైద్యాధికారులు పి.రాంబాబు, సౌరి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం

- రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



రాజవొమ్మంగిలో అధికారులతో మాట్లాడుతున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రాజవొమ్మంగి: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భూములు, చెట్లు, ఇళ్లు కోల్పోయిన వారందరికీ న్యాయం చేస్తామని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని చెకుంపాలెం నుంచి శరభవరం వరకు నిర్మాణదశలో వున్న హైవే పనులను పరిశీలించారు.దారి పొడవునా హైవే పనులను తనిఖీ చేశారు రాష్ట్ర ఆర్అండ్‌బీ, హైవే అథారిటీ, రెవెన్యూ, ఉద్యానవన అధికారుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అందరికీ న్యాయం జరిగేలా సర్వే చేయాలని తహసీల్దార్, వీఆర్వోలకు సూచించారు. నేషనల్ హైవే ఫుట్‌పాత్‌లపై ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేసినా, ఇతర వాహనాలు నిలిపినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజవొమ్మంగిలో బాణ సంచా దుకాణాలను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ సూర్యారావు ఆమె వెంట ఉన్నారు.

సమ్‌థింగ్ స్పెషల్

అనురాధ నాడే.. ఆరోగ్య దీపావళి

గిరిజనుల ఆచార వ్యవహారాలు చాలా విభిన్నంగా ఉంటాయి. సంస్కృతీ సంప్రదాయాలు మారుతున్నా పూర్వీకుల అడుగుజాడల్లో నడుస్తున్న గ్రామాలు ఇప్పటికీ ఉన్నాయి. ముంచంగిపుట్టు మండలంలో సుజనకోట, దారెల, కించాయిపుట్టు గ్రామాల్లో అందరిలా కాకుండా దీపావళి పండగను ప్రత్యేకంగా నిర్వహిస్తుంటారు. పండగ తరువాత వచ్చే అనురాధ నక్షత్రం నాడు ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో అందరూ సుఖసంతోషాలు, ఆరోగ్యంగా ఉండాలన్నదే ఇలా పండగ జరుపుకోవడం వెనుక అసలు కారణమని వారు చెబుతున్నారు.

- సుజనకోట, దారెల, కించాయిపుట్టులో విభిన్నంగా పండగ
- నవంబర్ మూడున జరిపేందుకు ఏర్పాట్లు
- సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలన్నదే ఆశయం
- పూర్వీకుల అడుగుజాడల్లో ఆ మూడు గ్రామాల గిరిజనులు



చిన్నారులకు స్నానాల కోసం బిందెలతో సిద్ధం చేసిన నీళ్లు (ఫైల్)

ముంచంగిపుట్టు: దీపావళి అనగానే తారాజువ్వలు, చిచ్చుబుడ్డీలు, టపాకాయల పేలుళ్లు గుర్తుకొస్తాయి. ఏ గ్రామంలో చూసినా బాణసంచా వెలుగులతో సందడిగా ఉంటుంది. అయితే సుజనకోట, దారెల, కించాయిపుట్టు పంచాయతీల్లో పరిస్థితి ఇందుకు భిన్నం. ఆయా ప్రాంతాల్లో దీపావళిని అందరిలా కాకుండా పండగ జరిగిన తరువాత వచ్చే అనురాధ నక్షత్రం రోజున నిర్వహిస్తారు. గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకోవడమే ఇలా జరుపుకోవడానికి వెనుక కారణమని ఆయా గ్రామాల గిరిజనులు చెబుతున్నారు.

చిన్నారుల కోసం..

అనురాధ నక్షత్రం రోజున ఉదయం నుంచి దీపావళి పండగ సందడి ప్రారంభం అవుతుంది. గ్రామంలో ఎనిమిది సంవత్సరాల నుంచి పదేళ్ల వయసు ఉన్న బాలికలకు పంచె కడతారు. అనంతరం వారిని గ్రామంలో ఏర్పాటు చేసిన చావిడి వద్దకు తీసుకువస్తారు. మామిడి తోరణాలతో తయారుచేసిన కిరీటాలతో వారిని అలంకరిస్తారు. ఒక క్రమంలో కూర్చోబెడతారు. బిందెలతో తీసుకువచ్చిన నీటిలో పసుపు, చేదు ఆనపకాయను కలుపుతారు. ఆ నీటిని పువ్వులు, అక్షింతలతో పూజిస్తారు. పంచెకట్టులో పాల్గొన్న బాలికలను గునపాల మీద కూర్చోబెట్టి స్నానం చేయిస్తారు. అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరిపై ఆ నీటిని జల్లుతారు. అనంతరం గిరిజన ఆచార ప్రకారం తెల్లటి వస్త్రాలను ధరింపజేస్తారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు వారికి హారతి ఇచ్చి ఆశీర్వదిస్తారు. ఆ తరువాత మహిళలంతా చుట్టం కార్యక్రమం నిర్వహిస్తారు. గ్రామంలో ఉన్న పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు ఇళ్లకు వెళ్తారు. వారిచ్చిన డబ్బులు, గుమ్మడికాయలు, బియ్యం తదితర సరుకులు స్వీకరిస్తారు. థింసా నృత్యాలు చేస్తూ మహిళలంతా చుట్టం కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆయురారోగ్యాలతో ఉండాలని..

పంచె కట్టు కార్యక్రమం చేయడం ద్వారా చిన్నారులు ఎటువంటి రోగాల బారిన పడరని సుజనకోట, దారెల, కించాయిపుట్టు గిరిజనుల నమ్మకం. నిత్యం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఎటువంటి దోషాలున్నా తొలగిపోతాయని వారు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఈ పండుగలో పాల్గొనే ప్రతి ఒక్కరిపై పూజలు చేసిన నీటిని జల్లుతారు. వారు సైతం నిత్యం ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉంటారని వారు విశ్వసిస్తుంటారు.

పండగ ఏర్పాట్లలో నిమగ్నం

పండగ తరువాత అనురాధ నక్షత్రం వచ్చే నవంబర్ మూడవ తేదీన దీపావళి పండగను నిర్వహించాలని సుజనకోట, దారెల, కించాయిపుట్టు గిరిజనులు నిర్ణయించారు. ఈ మేరకు పండగ పనుల్లో నిమగ్నమయ్యారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను అనుసరిస్తూ పంచెకట్టు పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ పండగ మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంది. మారుతున్న సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యంలో మూడు గ్రామాలకే పరిమితమైంది.



సుజనకోటలో పంచెకట్టిన చిన్నారులతో గ్రామ గిరిజనులు (ఫైల్)

పూర్వీకులకు ఇచ్చే గౌరవం



పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారానికి అనుగుణంగా సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ భక్తి శ్రద్ధలతో అనురాధ నక్షత్రం నాడు దీపావళి పండగను జరుపుతున్నాం. రాబోయే తరాల వారికి ఈ పండుగ విశిష్టతను తెలియజేస్తున్నాం. ఇలా పండగ జరుపుకోవడం పూర్వీకులకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నాం.

– సమరెడ్డి శంకర్‌రావు,
సుజనకోట, ముంచంగిపుట్టు మండలం

వచ్చేనెల 3న పండగ



నవంబర్ 3వ తేదీన అనురాధ నక్షత్రం రోజున దీపావళి పండగ నిర్వహిస్తాం. 8 నుంచి పదేళ్లలోపు ఆడ పిల్లలకు పంచెకట్టు కార్యక్రమం జరుగుతుంది. మారుతున్న సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం కొన్ని గ్రామాలకే ఈ పండగ పరిమితం అవుతోంది. పూర్వీకుల ఆచారం మేరకు ఏటా దీపావళి పండగను విభిన్నంగా నిర్వహిస్తున్నాం.

– వెంగడ నీలకంఠం,
సుజనకోట, ముంచంగిపుట్టు మండలం



పూజలో చిన్నారులు

పులి సంచారంతో కలకలం

- వరుస దాడుల్లో రెండు పశువుల మృతి
- ఉలిక్కిపడిన గిరిజన గ్రామాలు
- అప్రమత్తమైన అటవీశాఖ



బోదునూరులో పులి దాడిలో మృతిచెందిన ఎద్దు

కూనవరం : పులి సంచారం గిరిజన గ్రామాల్లో కలకలం రేపుతోంది. మండల పరిధిలోని బోదునూరు గ్రామ శివారులో బుధవారం ఉదయం 10.30 ప్రాంతంలో గిరిజన రైతు సోడె శ్రీను ఎద్దుపై దాడి చేసి చంపింది. అదేరోజు సాయంత్రం మేతకు వెళ్లిన మరో ఎద్దు పులిదాడిలో మృతి చెందింది. ఈ రెండు ఘటనలతో అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న బోదునూరు, పాలగూడెం, మెట్ట రామవరం, రామచంద్రాపురం, తాటిలంక, దూగుట్ట, కూళ్లపాడు, నర్సింగపేట, లింగాపురం, బురదగూడెం, భగవాన్‌పురం, రేపాక గ్రామాల గిరిజనులు ఆందోళనకు గురయ్యారు.

ట్రాప్ కెమెరాలు అమర్చినా..

చింతూరు మండలం తాటిలంక వద్ద పులి సంచరిస్తుందన్న సమాచారం మేరకు 15 రోజుల క్రితమే అటవీశాఖ అధికారులు అప్రమత్తమై గాలింపు చేపట్టారు. రెండు చోట్ల పాదముద్రలు గుర్తించారు. ఈనేపథ్యంలో చింతూరు కూనవరం మార్గంలో పులి అరుపులను గుర్తించిన వాహనచోదకులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ ప్రాంతంలో సుమారు 30 వరకు పైగా ట్రాప్ కెమెరాలను అమర్చారు. అయినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో పులి భయం నుంచి సమీప గ్రామాల ప్రజలు బయటపడ్డారు. కానీ అటవీశాఖ అధికారులు పోలీసు, రెవెన్యూ వారి సహకారంతో ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. ఈనేపథ్యంలో బుధవారం ఎద్దులపై పులి దాడి చేసి చంపడంతో గిరిజనులు భయభ్రాంతులకు గురయ్యారు.

మృతి చెందిన పశువులకు నష్ట పరిహారం

పులిదాడిలో మృతిచెందిన రెండు పశువులకు నష్టపరిహారం చెల్లిస్తామని డీఎఫ్‌వో బబిత తెలిపారు. స్థానిక అటవీ రేంజ్ పరిధిలో పులి దాడిలో రెండు పశువులు మృతి నేపథ్యంలో ఆమె సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీనిలో భాగంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది అనుసరించాల్సిన వ్యూహంపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎఫ్ మాట్లాడుతూ పులిని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పులి జాడ తెలుసుకునేందుకు నిఘా ఏర్పాటు చేశామని, ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దని సూచించారు. పులి ఇప్పటివరకు అటవీ ప్రాంతాల్లో తప్ప, రెవెన్యూ ప్రాంతాల్లోకి రాలేదని ఆమె వెల్లడించారు. పులి సంచరిస్తున్న పరిసర ప్రాంతాలకు చెందిన 21 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని ఆమె తెలిపారు. ఆమె వెంట సబ్ డీఎఫ్‌వో కేఎస్‌వీ రాఘవరావు, ఎఫ్ఆర్‌వోలు ఎం కరుణాకర్, ఆజాద్, ఎఫ్ఎస్‌వోలు, ఏబీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



బోదునూరులో మాట్లాడుతున్న డీఎఫ్‌వో బబిత

కదంతొక్కిన ఆదివాసీ యువత

- పాడేరు, చింతూరు ఐటీడీఏల ముట్టడి
- గిరిజన అభ్యర్థులతోనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిమాండ్
- హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో భారీగా ర్యాలీలు



పాడేరులో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు



చింతూరులో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఐటీడీఏను ముట్టడించిన నిరుద్యోగ యువత

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టులన్నింటిని గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని గిరి యువత డిమాండ్ చేశారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఐటీడీఏను వారు ముట్టడించారు. గిరిజన విద్యార్థి సంఘ భవనం నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర మాట్లాడుతూ నూరుశాతం ఉద్యోగాల జీవో నంబరు 3ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ- 2024 వల్ల గిరిజన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజనులకే కేటాయించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన జీవో నంబరు3 పునరుద్ధరణకు సీఎం చంద్రబాబు కట్టుబడి ఉండాలన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరిగితే సహించేది లేదని, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ సురేష్, జీఎస్‌యూ నాయకులు కిషోర్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం గిరి యువత చింతూరులో కదం తొక్కారు. జీవో నంబరు 3ను పునరుద్ధరించడంతోపాటు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డు నుంచి ఎర్రంపేట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఐటీడీఏను ముట్టడించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ జీవో నంబరు 3 తొలగింపుతో ఉద్యోగాలు లేక ఆదివాసీ యువత జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. తక్షణమే ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతం వల్ల వందశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని విమర్శించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిచ్చడి మురళి, బంగారు వెంకటేష్, సీసం సురేష్, పులి సంతోష్, కారం లక్ష్మి, సోడె మధు, మడివి రాజు, పొడియం బాబూరావు, అశోక్, రతన్, కోటి పాల్గొన్నారు.



పాడేరులో నిరుద్యోగ యువత ర్యాలీ



చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం



పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. 8లో



కొత్తపల్లి జిగేల్

- చివరి దశకు చేరుకున్న జలపాతం సుందరీకరణ పనులు
- ఆకట్టుకునేలా విద్యుత్ కాంతులు
- అభివృద్ధి చేసిన పాడేరు ఐటీడీఏ

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం విద్యుత్ దీపకాంతులతో ఆకట్టుకుంటోంది. పర్యాటకులను కట్టిపడేసేలా పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ రూ.10 లక్షలతో సుందరీ కరణ పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా పంచాయతీ రాజ్‌శాఖ అధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారులు పర్యాటకులను ఆకర్షించేలా విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకోవడంతో కొత్త శోభను సంతరించుకుంది.





బంతి రైతుకు లాభాల వెలుగు

దీపావళి పండగ నేపథ్యంలో మన్యంలోని బంతిపూలకు గిరాకీ ఏర్పడింది. బుధవారం స్థానిక పాత బస్టాండ్ మార్కెట్‌కు హుకుంపేట, పాడేరు, పెదబయలు, జి.మాడుగుల ప్రాంతాల గిరిజనులు భారీగా బంతిపూలను తీసుకువచ్చారు. సీతమ్మ కాటుక (చిన్న బంతి) బుట్ట రూ.150, ముద్దబంతి రూ.100కు విక్రయించారు. మంచి ధర రావడంతో వారిలో ఆనందం నెలకొంది. ఇక్కడ కొనుగోలు చేసిన బంతిపూలను వ్యాపారులు రాజమహేంద్రవరం, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతాలకు తరలించారు.

– సాక్షి పాడేరు



క్లుప్తంగా

57 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు


జి.మాడుగులలో గంజాయి నిందితులతో ఎస్‌ఐ షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది

జి.మాడుగుల: ఆంధ్ర–ఒడిశా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ షణ్ముఖరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. జి.మాడుగుల–నుర్మతి రోడ్డులో తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేసే సమయంలో ముగ్గురు వ్యక్తులు మోత బరువుతో మూడు మూటలు 57 కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన సతీష్‌బాబు, తిరుమారునే రమేష్, జి.మాడుగుల మండలానికి చెందిన కొర్ర అంజయ్యగా తేలిందన్నారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామస్తుల శ్రమదానం

- తూటంగిలో తాగునీటి ట్యాంకును శుభ్రం చేసిన గ్రామ మహిళలు


తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న స్థానికులు

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ కేంద్రంలోని తాగునీటి ట్యాంకులో చెత్తచెదారం నిండిపోయి ఉండడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు కొండపైన ఉన్న మట్టి కొట్టుకొచ్చి ట్యాంకులో నిండిపోయింది. గ్రామస్తులకు ట్యాంకులోని బురద నీరే దిక్కుకావడంతో పలువురు స్థానికులు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో స్థానికులంతా కలిసి ట్యాంకును శుభ్రపరిచేందుకు బుధవారం శ్రమదానం చేపట్టారు. ఈ మేరకు కొందరు మహిళలు ట్యాంకు లోపలకు దిగి బురదనీటిని, మట్టిని తొలగించారు. ట్యాంకు లోపల, బయట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ట్యాంకు శుభ్రం చేయడంపై స్థానికులను పలువురు అభినందించారు. వార్డు సభ్యులు బాలన్న, చక్రి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ,అరాచక పరిపాలనపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. టీడీపీ అధినేత, కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన తప్పితే అభివృద్ధి శూన్యమన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పటానికి ప్రజలందరు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, సర్పంచ్, ఎంపీటీసీలు, వివిధ పదువుల్లో ఉన్న నాయకులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. వైస్ ఎంపీపీ కె. సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, చిన్నకుమారి, సీదరి కొండబాబు, మాలన్న, గంగరాజు, ఎంపీటీసీ సభ్యులు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, పాంగి లక్ష్మి, నాయకులు అంద్రయ్య, పెద్దబాలన్న, అచ్చిబాబు, నీలమ్మ, కృష్ణారావు, సీతారాంనాయుడు, వేణుబాబు, వలసయ్య, రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహం ప్రారంభించాలని ఆందోళన


ముంచంగిపుట్టులో వసతి గృహం ఎదుట ఆందోళన చేస్తున్న కళాశాల విద్యార్థులు

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. భవనం పూర్తయినా ప్రారంభం కాని బాలికల వసతి గృహం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు.ఉన్నత అధికారులు స్పందించి వెంటనే వసతి గృహాన్ని ప్రారంభించాలని పలు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీను, కె.బాలన్నలు మాట్లాడుతూ కళాశాల బాలికలకు వసతి గృహం నిర్మించి ఏడాదవుతున్నా ప్రారంభించక పోవడంతో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. బాలికలు వసతి గృహం ప్రారంభం కాక అద్దె గృహాల్లో ఉంటూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాలికల వసతి గృహాన్ని ప్రారంభించాలని, లేని పక్షన ఆందోళన కార్యక్రమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ నర్సమ్మకు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.ఎస్ఎఫ్ఐ నాయకులు దేవన్న, రాములమ్మ, కామేశ్వరరావు, కొండబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


మృతి చెందిన పూజారి కమల

అరకులోయ రూరల్ : మండలంలో కొత్తభల్లుగుడ పంచాయతీ నియలిగుడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ పూజారి కమల (39) తడిగా ఉన్న బట్టలు ఇంటి వెనుక ఉన్న తాడుపై ఆరబెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి మంగళవారం తీవ్ర గాయాలపాలైంది. బంధువులు ఆమెను వెంటనే అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆరోగ్యం మరింత విషమించి ఆమె మృతి చెందినట్టు వైద్య సిబ్బంది, బంధువులు తెలిపారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని, మృతికి గల కారణాలపై విచారణ చేపట్టాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారుల వైఫల్యంతోనే ఈ సంఘటన జరిగి ఉంటుందని స్థానిక సర్పంచ్ కొర్రా రాధిక తెలిపారు.

డ్రైనేజీ మరమ్మతుల కోసం వినతి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థకు మరమ్మతులు చేయాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, గిరిజన సంఘం నేతలు బుధవారం స్థానిక ఎంపీడీవో శ్రీసాయిహర్షను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ మండల కేంద్రంలో డ్రైనేజీలు ఉన్నా..అవీ ఎక్కడబడితే అక్కడ చెత్తచెదారంతో నిండిపోయి, మురుగునీరు నిల్వ ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొందని, వర్షాకాలంలో రోడ్డు పైకి నీరు వచ్చేస్తుందని, రోడ్లు పాడైపోవడంతో పాటు చిత్తడిగా రోడ్లు దర్శనమిస్తున్నాయని వినతిలో పేర్కొన్నారు. మురుగునీటి నిల్వతో వ్యాధులు ప్రబలుతున్నాయని తక్షణమే అధికారులు స్పందించినట్టు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న అన్ని డ్రైనేజీలను మరమ్మతులు చేయాలని ఆయన కోరారు. గిరిజన సంఘం నేతలు శ్రీను, రాందొర, నర్సింగరావు పడాల్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి: మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన జోగిరెడ్డి

గంగవరం : మండల కేంద్రంలోని మధ్య వీధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరోకరు తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ డి.భూషణం విలేకరులకు తెలిపారు. బుధవారం సాయంత్రం రంపచోడవరం మండలం చిన్నగెద్దాడ గ్రామానికి చెందిన కలుముల జోగిరెడ్డి (33) తన బంధువు ఎండపల్లి రాయుడు (31)తో కలిసి బైక్‌పై పాతగంగవరం వైపు వెళ్తుండగా కొత్తపల్లి వైపు నుంచి బైక్‌పై వస్తున్న శెట్టిపల్లి గ్రామానికి చెందిన కురుసం పాపారావు ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో జోగిరెడ్డి, రాయుడులకు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది క్షతగాత్రులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కలముల జోగారెడ్డి తలకు బలమైన గాయం కావడంతో వైద్య సేవలు అందించే సమయంలో మృతి చెందాడు. ఎండపల్లి రాయుడు కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలైనట్టు ఎస్ఐ భూషణం తెలిపారు. తీవ్ర గాయాలైన ఎండపల్లి రాయుడును మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించామని, జోగిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం

- పర్యావరణానికి హాని కలిగిస్తే చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పర్యావరణానికి, అడవులకు హాని కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటక ప్రాంతాలలో రహదారుల అభివృద్ధితో పాటు తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. పర్యాటక,అటవీ ప్రాంతాలలో అనుమతులు లేకుండా ఫైర్ క్యాంపులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఏజెన్సీ ముఖ ద్వారాల వద్ద పర్యాటకుల వివరాలు నమోదు చేయాలన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు, బెల్టుషాప్‌లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బైక్‌లపై వచ్చే పర్యాటకులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీశాఖ అనుమతులు లేకుండా అడవుల్లోకి ప్రవేశిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలలో వాణిజ్య సంస్థలు,హోటళ్లు, రిసార్ట్‌ల యాజమానులు తప్పనిసరిగా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్ వర్చువల్ విధానంలో,జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పాడేరు డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, డీఆర్వో పద్మావతి, జిల్లా పర్యాటక అధికారి దాసు, డీపీవో లవరాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఎల్పీవో పీఎస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో 'ఆన్‌లైన్' మోసం

- ఉద్యోగాలకు ఆశపడి నష్టపోయిన బాధితులు
- రూ.లక్షల్లో చేజార్చుకున్న వైనం
- ఉన్నతాధికారుల దృష్టికి మోసం: ఎస్ఐ నర్సింహమూర్తి

రాజవొమ్మంగి : ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు హెచ్చరిస్తున్నా ఏదొక చోట మోసపోతూనే ఉన్నారు. తాజాగా రాజవొమ్మంగిలో ఈ తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఇంటి వద్దనే ల్యాప్ ట్యాప్ లేదా ఫోన్ ద్వారా ఉద్యోగం చేయండి, వారానికి రూ. 20వేలకు మించి ఆదాయం పొందండి అనే ప్రకటన చూసిన మహిళలు, యువతీ యువకులు అడ్డంగా బుక్కయ్యారు. రాజవొమ్మంగి పరిసరాల్లో ఓయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న దాదాపు వంద మంది రూ.లక్షల్లో సొమ్ము పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఓ బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు రెండు నెలల క్రితం సెల్ ఫోన్‌లో 'ఏఎస్‌వో' యాప్‌ను చూసిన ఆమె డౌన్‌లోడ్ చేసుకుంది. వెంటనే మీకు ఉద్యోగం కన్ఫర్మ్ అయింది. అయితే రూ. 20 వేలు చెల్లించాలంటూ మెసేజ్ వచ్చింది. అయితే అప్పటికే ఈ యాప్‌ను చైన్‌లింక్‌లా కొంతమంది రన్ చేస్తున్నారు. అంతే కాకుండా వారం వారం ఫోన్ పే ద్వారా సొమ్ము జమ అవుతున్నట్టు తెలుసుకున్న కొత్తవారు కూడా ఈ ఆన్‌లైన్ ఉచ్చులో పడ్డారు. మెసేజ్ మేరకు డబ్బులు జమ చేశారు. ఇలా రెండు నెలలు గడిచిపోయాయి. ప్రతి ఒక్కరు వారం వారం వస్తున్న ఆదాయాన్ని చూసి మురిసిపోయారు. అయితే ఉన్నట్టుండి ఈ యాప్ ఒక్కసారిగా సెల్‌ఫోన్లలో కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఏం చేయాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు. భారీగా నష్టపోయినా బయటకు చెప్పేందుకు బాధితులు ముందుకు రావడం లేదు. దీనిపై ఎస్ఐ నర్సింహమూర్తిని వివరణ కోరగా ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అయినా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవడం విచారకరమన్నారు. ఈ మోసాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమగ్ర దర్యాప్తు చేస్తామని ఆయన వివరించారు.

మంచి లక్ష్యంతోనే ఉన్నత స్థానం

- కలెక్టర్ దినేష్‌కుమార్
- సమాజానికి మేలు చేయాలని విద్యార్థులకు హితవు


పాల్గొన్న విద్యార్థులు

సాక్షి,పాడేరు: మంచి లక్ష్యంతో ఉన్నత స్థానానికి ఎదిగి సమాజానికి మేలు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ నిర్వహించిన కిశోర్ వికాస్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల మంచి ఆలోచనలతో చదువుపై దృష్టి సారించాలన్నారు.యుక్త వయసులో ఆడపిల్లలు మరింత అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలిసీ తెలియని వయసులో అనాలోచిత చర్యలతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఆడపిల్లలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో పేదరికం వల్లే బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటి నుంచి ఆడపిల్లలు బయటపడాలంటే బాగా చదువుకుని ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. జిల్లాలో గంజాయి ప్రభావం ఎక్కువ మందిపై ఉండటం బాధాకరమన్నారు. గంజాయి పండించినా, వినియోగించినా, అమ్మకాలు జరిపినా విద్యార్థులంతా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులంతా ఆరోగ్యకరమైన సమాజ మార్పునకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ మురళీ, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమాదేవి, సీఐ జీనబంధు,డీసీపీవోటీ సద్దు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీపై దాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

- ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్

ఎటపాక: లక్ష్మీపురం పీహెచ్‌సీపై మంగళవారం అర్ధరాత్రి దాడిచేసి సిబ్బందిని దుర్భాషలాడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం పీహెచ్‌సీకి చేరుకున్న బృందం సంఘటన వివరాలు తెలుసుకుంది. ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గుజ్జా సీతమ్మ మాట్లాడుతూ బూర శ్రీహరి అనే వ్యక్తి మద్యం చేసి అర్ధరాత్రి ఆస్పత్రికి వచ్చి అక్కడి సామగ్రిని ధ్వంసం చేశాడని వివరించారు. సిబ్బందిని దుర్భాషలాడి భయభ్రాంతులకు గురిచేసినట్టు వారు వాపోయారు. వెంటనే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని సిబ్బంది వివరించారు. అతనిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏవీయస్పీ జిల్లా అధ్యక్షుడు కుంజా శ్రీను, మడివి నెహ్రూ,మి డియం సీతయ్య, గంగరాజు, సున్నం లక్ష్మణ్, కంగాల భాస్కర్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

డీఐజీ గోపీనాథ్ జెట్టి


రోలుగుంటలో రికార్డులను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

మాకవరపాలెం/రోలుగుంట: గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు డైనమిక్, స్టాటిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలను నిర్వహిస్తున్నట్టు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మాకవరపాలెం, రోలుగుంట పోలీస్ స్టేషన్లను జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్‌తో కలిసి డీఐజీ గోపీనాథ్ జెట్టి సందర్శించారు. రోలుగుంటలో అనకాపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ పి.రామకృష్ణరావు పూల మొక్కలను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. రెండు స్టేషన్లలో రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గత మూడేళ్లగా పెండింగ్‌లో ఉన్న కేసులను, వాటి ప్రస్తుత దర్యాప్తు స్థాయిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్ ఇతర కేసుల ఫైళ్లను పరిశీలించి, కేసుల దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి గూర్చి ఆరా తీశారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో కీలక నిందితులను అరెస్టు చేసే విధంగా దిశానిర్దేశం చేశారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వాట్స్ అప్ గ్రూప్ ద్వారా కూడా వారికి సమాచారం చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండేలా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి, వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళల భద్రతకు పెద్దపీటవేయాలని, పోలీస్ శాఖ అండగా ఉందని వారికి భరోసా కల్పించాలని, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, డీఎస్పీ కుమార్, నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు రేవతమ్మ, గోవిందరావు, ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఐజీ గోపానాథ్ జెట్టి సూచించారు. మాకవరపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ మోసగాళ్లు కొత్తకొత్త పంథాలను అవలంభిస్తున్నారని చెప్పారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని. ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని తెలిపారు. మీకు పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని బెదిరిస్తూ కొందరు నగదు డిమాండ్ చేస్తున్నారన్నారు. డాక్టర్లు, అధిక మొత్తంలో నగదు లావాదేవీలు చేస్తున్న వారిని టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. కొత్త వ్యక్తులు, తెలియని నంబర్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేకుంటే 1930 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని చెప్పారు.